క్లుప్తంగా

వరుస తుపాన్లతో కలవరం



మునగపాకలో కోతదశకు చేరుకున్న వరిపైరు

మునగపాక: వరుస తుపాన్లతో రైతులు కలవర పడుతున్నారు. వరి పంట చేతికి అందివచ్చే తరుణంలో తుపానులు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నాలుగు నెలల పాటు ఇంటిల్లి పాది కష్టపడి వరిసాగు చేపట్టారు. అయితే అన్ని రకాల ఇబ్బందులను అధిగమించి పంట చేతికి వచ్చే సమయంలో అకాల తుపానులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల రైతులు వరి పైరు కోతలు చేశారు. మరికొన్ని చోట్ల కోతలు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వేలాది రూపాయలు వరిసాగుకు పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం వాతావరణంలో మార్పులు తమను కుంగదీస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్లపు ఆనందపురంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామాలయం ప్రాంగణంలో జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం



దరఖాస్తులను పరిశీలిస్తున్న రీ-సర్వే డీటీ పడాల్

మునగపాక: రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీ-సర్వే డీటీ పడాల్ కోరారు. మండలంలోని రామభద్రపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు సంబంధించి భూవివాదాలకు పరిష్కారం దొరకుతుందన్నారు.

రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ సత్యనారాయణ

పాయకరావుపేట: రైతుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.సత్యనారాయణ తెలిపారు. పెంటకోట గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పలువురు రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి సత్వరమే రైతుల భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, సర్వేయర్లు, డీటీ, వీఆర్వో, తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం



సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పాయకరావుపేట: మండలంలోని మంగవరం, అరట్లకోట గ్రామాల్లో దాడులు నిర్వహించి 20 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. మంగవరం గ్రామానికి చెందిన ఒక్కరిని, అరట్లకోట ఒక్కరిని అదుపులోకి తీసుకుని యలమంచిలి కోర్టుకు తరలించగా, కోర్టు అనుమతితో రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

ఆగని గ్రావెల్ దందా!

- కూటమి పాలనలో పేట్రేగిపోతున్న అక్రమార్కులు
- యండపల్లి, చినబొడ్డేపల్లి, అన్నవరం రెవెన్యూ పరిధిలో భారీగా తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ శాఖాధికారులు
- భారీగా ప్రభుత్వ ఖజానాకు గండి



యండపల్లి వద్ద గ్రావెల్ తవ్వకాలతో తరిగిపోయిన కొండ

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. అడ్డదారుల్లో సొమ్ము చేసుకునేందుకు పచ్చని కొండలపై కన్నేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ అండతో అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. కోటవురట్ల మండలంలో ఆర్నెళ్లుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో రాత్రీ పగలూ తేడా లేకుండా గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో అన్నవరం, యండపల్లి, చినబొడ్డేపల్లి, ఇందేశమ్మవాక, గొట్టివాడ సాబనాల కొండ ప్రాంతాలలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిపోతోంది.

◆ అన్నవరం శివారున ఏలేరు కాలువ 84వ కిలో మీటరు రాయి వద్ద భారీగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడ ఏలేరు కాలువకు సంబందించిన భూమిలో భారీగా తవ్వకాలు చేస్తున్నారు. సుమారు రెండెకరాల పరిధిలో 10 అడుగుల లోతున గ్రావెల్‌ను తరలించేశారు. ఇలా కాలువ వెంబడి చాలా చోట్ల గ్రావెల్ తవ్వకాలు జరిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించకపోవడం దారుణమని పలువురు ఆరోపిస్తున్నారు.



అన్నవరం శివారున ఏలేరు కాలువ పక్కన అక్రమ తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గొయ్యి

◆ యండపల్లి ఎస్సీ కాలనీ దాటాక వజ్రగడ వెళ్లే రహదారిలో కొండను ఆనుకుని ఉన్న డీ పట్టా భూమిలో ఆర్నెళ్లుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇక్కడ ఒక్కొక్క ట్రాక్టరుకు రూ.200, లారీకి రూ.500 చొప్పున స్థానికులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజు పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు తిరుగుతుండడంతో సీసీ రోడ్డు శిథిలమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లారీలు, ట్రాక్టర్ల దుమ్ము ఇళ్లను కప్పేస్తోందని వాపోతున్నారు.

◆ చినబొడ్డేపల్లిలో కేవో మల్లవరం వెళ్లే రోడ్డు, చినబొడ్డేపల్లి శివారున కొండలపై తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పచ్చని కొండలను ధ్వంసం చేసే చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

◆ దీనిపై తహసీల్దారు తిరుమలబాబును వివరణ కోరగా.. జల్లూరు వంతెన అప్రోచ్‌రోడ్డు కోసం గ్రావెల్ తవ్వకాలకు యండపల్లి వద్ద తవ్వకాలకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు. అయితే ఇక్కడి నుంచి కొన్ని లారీలు, ట్రాక్టర్లు పక్కదారి పట్టి ధర్మసాగరం, నర్సీపట్నం, వేములపూడి ప్రాంతాలకు గ్రావెల్ తరలిపోతోందన్న ఆరోపణపై స్పందిస్తూ తన దృష్టికి రాలేదని, కేవలం జల్లూరు వంతెన అప్రోచ్ రోడ్డు కోసమే కొన్ని ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చామన్నారు. అక్రమ రవాణాపై సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు, ధర్మవరం, పెనుగొల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సెల్‌ఫోన్ల జోలికి పోవద్దు



కె.వెంకటాపురంలో విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎంఈవోలు

కోటవురట్ల: పదో తరగతి విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీల జోలికి పోకుండా చదువుపై శ్రద్ధ వహించాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సూచించారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఎంఈవోలు మంగళవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలు, అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాయంత్రం సమయంలో కాస్త శారీరక వ్యాయామం చేయాలని, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్ లాంటి జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఉదయాన్నే లేచి ప్రశాంత వాతావరణంలో చదవడం వల్ల లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు, అప్పారావు, మురళి, జె.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి పిలుపునిచ్చారు. స్వయం సమృద్ధి ఉన్న గ్రామాలు తయారు చేసేందుకు చేపట్టే ప్రణాళికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం మునగపాక మండల పరిషత్ హాలులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, రహదారి సదుపాయం, పాఠశాలలు, వైద్యం వంటి సేవలను పటిష్టవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన వనరులను సమకూర్చడంపై దృష్టి సారించాలన్నారు. ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పంటలను సంరక్షించుకోవాలి



పొలం పిలుస్తోందిలో రైతులకు పలు సూచలిస్తున్న రాంబిల్లి వ్యవసాయాధికారులు



క్షేత్ర పరిశీలన చేస్తున్న పాయకరావుపేట వ్యవసాయ శాఖ అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): రాబోయే రెండు రోజులు తుపాను ప్రభావంతో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, మండలంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటలను సంరక్షించుకోవాలని రాంబిల్లి మండల వ్యవసాయాధికారి సిహెచ్.సుమంత సూచించారు. మంగళవారం రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోసిన వరిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, కుప్పలు వేసుకుని టార్పలిన్‌లతో కప్పాలని సూచించారు. రబీలో వరి, అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవడం శ్రేయస్కరం

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరా మామిడి తోటకు ప్రీమియంగా రూ.2200 చెల్లించాలన్నారు. వరి పంట ఎకరానికి రూ.600, అపరాలకు రూ.300 చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ, వీహెచ్‌ఏ, ఏహెచ్‌ఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సర్పంచ్ మంచాల గోపి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పెన్షనర్లకు కేటాయింపులు లేవు

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వర్రావు



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వర్రావు

యలమంచిలి రూరల్: పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, డీఏల గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని, రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు ఎలాంటి అదనపు కేటాయింపులు లేవని యలమంచిలి తాలూక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వర్రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ ఖాతాల్లో జమ చేస్తే చాలన్నట్టు ఉందని పిస్తోందన్నారు. పెన్షనర్లంతా వారి లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా నిక్షిప్తం చేసుకోవాలని, ఇందు కోసం ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని స్థానిక ఉపఖజానాధికారి టి.ఉదయభాస్కర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో 75 నుంచి 80 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ జి.రవికుమార్, విశాఖపట్నం సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ ఎంవీ గణేష్ కుమార్, సంఘం కార్యదర్శి జి.సాంబమూర్తి, పెద్ద సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.

'డ్రోన్ దీదీ'ని సద్వినియోగం చేసుకోవాలి

అచ్యుతాపురం: డ్రోన్ దీదీ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచించారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏపీఎంలు, ఏవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమన్నారు. డ్రోన్‌లను సబ్సిడీపై అందజేస్తామని తెలిపారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



కోటవురట్లలో శిక్షణ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, అధికారులు

కోటవురట్ల: పంచాయతీల సుస్థిరాభివృద్ధికి అంతా సమన్వయంగా కృషి చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులకు మూడో రోజు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అభివృద్ధికి అవలంబించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కావలసిన వనరులను గుర్తించి ప్రణాళిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, ఏవో చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగులాపల్లిలో తోడపెద్దు మృతి



మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఓ తోడపెద్దు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. 20 ఏళ్ల పాటు ఏ గ్రామంలో సేవగరిడి జరిగినా ఈ తోడపెద్దు పూజలందుకునేది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన సేవగరిడీలు పాల్గొన్నాయి. అనంతరం సంతబయిలులో తోడపెద్దుకు పాలకొలువు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రోలుగుంట: మండలంలోని కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెం సరిహద్దులో పేకాడుతున్న వారిపై మంగళవారం స్థానిక ఎస్ఐ పి.వెంకట్రావు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దాడి సమయంలో పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

20న ఎస్.రాయవరం మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నిర్దేశించిన సమయానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో ఈ మూడు నెలలుగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నివేదికలు తీసుకురావాలన్నారు.

ఆర్థిక స్వావలంబన కోసం నిరంతర కృషి అవసరం



కోటవురట్లలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

కోటవురట్ల: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఎస్ఐ రమేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ, ఈవో పీఆర్డీ రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన మేలుకొలుపులు



మునగపాకలో మేలుకొలుపులో భక్తులు



వాడ్రాపల్లిలో నగర సంకీర్తన



జగ్గన్నపేటలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం మేలుకొలుపుల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ధనుర్మాసంలో భాగంగా భక్తులు వేకువజామునే నిద్రలేచి చన్నీటి స్నానమాచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల చిత్రపటాలతో డప్పు వాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మునగపాక, వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, చూచుకొండ తదితర గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపారు. వచ్చే నెల 13న భోగి పండుగతో మేలుకొలుపు ముగింపు జరగనుంది.

అచ్యుతాపురం: ధనుర్మాసం సందర్భంగా జగ్గన్నపేటలో మంగళవారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ యలమంచిలి డివిజన్ కన్వీనర్ కొల్లి అప్పారావు, కృష్ణ, ఆడారి త్రినాథ్, మల్ల బుజ్జి, వెంకటలక్ష్మి, గోవింద్, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల్ని విజయవంతం చేయాలి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు నర్సీపట్నంలో నిర్వహించనున్న సీపీఎం మహాసభల్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆర్.రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అచ్యుతాపురంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అధిక సంఖ్యలో మహాసభలకు తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రామ సదాశివరావు, బుద్ధ రంగారావు, కన్నుంనాయుడు, నాగేశ్వరరావు, పరదేశి నాయుడు, సన్యాసిరావు, మోహన్‌రావు, ఎస్.నాయుడు, అప్పారావు, సన్నిబాబు పాల్గొన్నారు.

బకాయిల కోసం అభిజిత్ కార్మికుల ఆందోళన



అభిజిత్ కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుడు ఆర్.రాము

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల నాయకుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అభిజిత్ కార్మికులతో కలిసి ఆయన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 35 రోజులుగా కర్మాగారాన్ని మూసివేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా లే ఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు.